క్లుప్తంగా

రేష్మీయాదవ్‌కు ఆడారి అభినందనలు



క్రీడాకారిణి రేష్మీని అభినందిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

మల్కాపురం : ఇటీవల గోవాలో జాతీయ ఎల్బో బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన మల్కాపురం, గొల్లవీధి ప్రాంతానికి చెందిన వాకాడ రేష్మీయాదవ్‌ను వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అభినందించారు. గురువారం పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆనంద్‌కుమార్‌ను రేష్మీయాదవ్ కలిశారు. భవిష్యత్తులో మరింత రాణించాలని ఆనంద్‌కుమార్ ఆశీర్వదించారు.

'సెమ్స్'లో 25 మంది మహిళలకు ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన మహిళలకు జాబ్ ఆఫర్ లెటర్లు అందజేస్తున్న పోర్ట్ అధికారులు

సింధియా : విశాఖ పోర్ట్ అథారిటీ సహకారంతో భారత ప్రభుత్వం స్థాపించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్)లో నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత ఉచిత శిక్షణ శిబిరం విజయవంతంగా పూర్తి అయిందని పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే తెలిపారు. మహిళా సాధికారత దిశగా నిర్వహించిన ఈ శిబిరంలో 25 మంది మహిళా నిరుద్యోగులు కొరియర్ సూపర్‌వైజర్, వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్, పిక్కర్, ఇన్వెంటరీ కంట్రోలర్, సి.ఎస్.సి ఆపరేటర్, వెల్డర్, ఎలక్ట్రిషియన్ కోర్సుల్లో, ఇన్వెంటరీ కంట్రోలర్ కోర్సులలో 60 రోజులు శిక్షణ పొందారన్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ సంస్థలో ఉద్యోగాలు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా పోర్ట్ చైర్మన్ డాక్టర్ అంగముత్తు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించి కుటుంబానికి, దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఉద్యోగాలు పొందిన వారికి జాబ్ ఆఫర్ లెటర్లను అంగముత్తు అందజేశారు.


చిరస్మరణీయుడు సుబ్బారావు



సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న షిర్డీ సాయి ధ్యాన మందిరం కమిటీ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో ధ్యాన మందిరం వ్యవస్థాపకుడు సుబ్బారావు సంస్మరణ సభను కమిటీ సభ్యులు నిర్వహించారు. జయంతి సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ అధ్యక్షుడు వెంకట శివ సత్యనారాయణ మాట్లాడుతూ సుబ్బారావు చూపిన దారిలో ఈ ధ్యాన మందిరి ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యదర్శి సుధా సీతాపతి , కోశాధికారి బిబల రామకృష్ణ, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎంబీ రాజశేఖర్, ఎస్. పద్మ పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్ (త్రైత శకం-46)ను మర్రిపాలెం వుడాలేఅవుట్ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్‌కుమార్‌కు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సంమితి, హిందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ, విజయరాంపురం కమిటీ ఆనందాశ్రమం అధ్యక్షుడు శ్రీనివాస్ తమ మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. ఆడారి ఆనంద్‌కుమార్ నియోజకవర్గ సమన్వయకర్తగా వచ్చిన తరువాత కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారని, అందుకే ఆయనకు మద్దతు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మద్దతు తెలిపిన వీరికి ఆడారి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సేవా సమతి సభ్యులు కె.త్రినాథ్, గౌతమ్, శికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆడారి ఆనంద్‌ను ఆశీర్వదించండి



60వ వార్డులో ప్రచారం చేస్తున్న రమాకుమారి, వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్



59వ వార్డులో ప్రచారం చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్ మేనకోడలు రోహిణి



58వ వార్డులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న జేసీఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు

మల్కాపురం : పోలింగ్ సమయం దగ్గరపడుతున్న వేళ నియోజకవర్గంలో ప్రచారాలు మరింత జోరందుకున్నాయి. అన్ని వార్డుల్లోనూ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈసారి కచ్చితంగా పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు అంతా సైనికుల్లా పనిచేస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే గణబాబును ఇంటికే పరిమితం చేయాలని కంకణం కట్టుకున్నారు. 58వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లో జేసీఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు ఆధ్వర్యంలో వార్డు ప్రాంత నాయకులు, కార్యకర్తలు రామ్‌నగర్, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో ప్రచార ర్యాలీ చేపట్టారు. 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్ ఆధ్వర్యంలో వార్డు పరిధి హిమచల్‌నగర్, గణపతినగర్ కొండ ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ మేనకోడలు రోహిణి డోర్ టూ డోర్ ప్రచారం చేశారు. ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఇండ్రస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, ఎం.పెంటారావు పాల్గొన్నారు. 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో డోర్ టూ డోర్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు అనే గ్రహణం వీడాలంటే మీరంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్‌ను, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు అశోక్, బుజ్జి పాల్గొన్నారు. ఇదే వార్డులో కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్టు బోర్డు డైరెక్టర్ మళ్ల ధనలత, మహిళ కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. 61వ వార్డు మల్కాపురం, రెడ్డివీధి, గాంధీజీవీధి, మార్కెట్ లైన్ ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం, సచివాలయాల కన్వీనర్లు ఎస్.వి.రమణయాదవ్, మంగ డోర్ టూ డోర్ ప్రచారాన్ని నిర్వహించారు.



డోర్ టూ డోర్ ప్రచారం చేస్తున్న మళ్ల ధనలత



62వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

కాపుల ద్రోహి గణబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

- కల్యాణ మండపం నిర్మాణంలో తెరవెనుక కుట్రలు
- మీ ఓటుతో గణబాబును తరిమికొట్టండి
- శ్రీకృష్ణదేవరాయ కాపు,తెలగ,బలిజ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపు

మల్కాపురం : టీడీపీ ఎమ్మెల్యే గణబాబు కాపుల ద్రోహి అని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ విమర్శించారు. కాపుల కోసం రూ.2 కోట్లతో భవనం నిర్మిస్తుంటే.. ఆ పనులను ఆపేందుకు టీడీపీ అనుచరుడైన కాంట్రాక్టర్ కంపర్ ఆనంద్‌తో గణబాబు డ్రామాలు ఆడుతున్నాడన్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని తప్పుడు ప్రచారం చేస్తు, కోర్టుకు వెళ్లాలని గణబాబు సదరు కాంట్రాక్టర్‌ను ఉసిగొల్పుతున్నాడన్నారు. ఈ భవన నిర్మాణం కోసం ఇప్పటికే సదరు కాంట్రాక్టర్‌కు రూ17 లక్షలు చెల్లించామని స్పష్టం చేశారు. పారిశ్రామిక ప్రాంత శ్రీకృష్ణదేవరాయ కాపు,తెలగ,బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఆత్మీయ సమావేశంలో కాపు కల్యాణ మండపం నిర్మాణం వెనుక టీడీపీ ఎమ్మెల్యే గణబాబు కుట్రను తెలియజేశారు. కాపుల కోసం జరుగుతున్న భవనాన్ని గణబాబు అడ్డుకోవడం ఎంతవరకు న్యాయమన్నారు. కాపులంటే ఆయనకు గిట్టదని, అందుకే ఇలా తెరవెనుక కుట్రలు పన్నుతున్నాడన్నారు.తాను ఎమ్మెల్యేగా గెలిచిన ఆరు నెలల్లో పారిశ్రామిక ప్రాంతంతో కాపుల కోసం ఓ మంచి భవనం నిర్మిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీకి అనుకూలంగా లేని వారిని గణబాబు వర్గీయులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. 45వ వార్డు ఏకేసీకాలనీలో సుమారు రూ.675 కోట్ల రూపాయలతో నిరుపేదలకు త్వరలో ఇంటి నిర్మాణాలను చేపడుతున్నట్టు వివరించారు. ఇప్పటి వరకు పశ్చిమలో రూ.225 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టానని గుర్తుచేశారు. పారిశ్రామిక ప్రాంత నిరుద్యోగులకు హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో ఉపాధి కల్పించాల్సిన గణబాబు..సంస్థతో లోపాయకారి ఒప్పందం కుదర్చుకుని కాసులకోసం కక్కుర్త పడి ఉద్యోగాలు ఇవ్వకుండా చేశాడన్నారు. ఇటువంటి వ్యక్తిని నియోజకవర్గం నుంచే మీ ఓటుతో తరిమేయాలని పిలుపునిచ్చారు. తన సొంత నిధులతో నిరుద్యోగుల భవిష్యత్తు కోసం జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తుంటే..గణబాబు నిరుద్యోగులను మోసం చేస్తున్నాడని దుయ్యబట్టారు. జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు తోట రాజీవ్ మాట్లాడుతూ కాపులను గుర్తించినది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని, రాష్ట్రంలో టీడీపీ, జనసేన ఒక ఎంపీ, 12 ఎమ్మెల్యే సీట్లు ఇస్తే, అదే వైఎస్సార్‌సీపీ కాపులకు 38 ఎమ్మెల్యేలు, ఐదు ఎంపీ సీట్లు కేటాయించిందని గుర్తు చేశారు. కాపులంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నామని స్పష్టం చేశారు. పశ్చిమ ఎన్నికల పరిశీలికురాలు పీలా ఉమారాణి, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీనివాస్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, కుమార్, అమరావతి పాల్గొన్నారు.

డెవలప్‌మెంట్ వాచ్

కొండవాలు ప్రాంతంలో ప్రగతి 'మెట్లు'



60వ వార్డు ఇందిరాకాలనీ పరిధిలో రూ12 లక్షలతో నిర్మించిన మెట్లు



62వ వార్డు దుర్గానగర్‌లో రూ.12 లక్షలతో నిర్మించిన మెట్లు



59వ వార్డు హిమాచల్‌నగర్ కొండ ప్రాంతంలో రూ.16 లక్షలతో వేసిన మెట్ల మార్గం



62వ వార్డు అంబేద్కర్‌కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించిన మెట్లు

వర్షం పడితే ఆ ప్రాంతాలు గజగజలాడేవి. కనీస సౌకర్యాలు ఉండేవి కావు. గత తెలుగుదేశం ప్రభుత్వం పశ్చిమ నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతాలను కనీసం పట్టించుకోలేదు. తీవ్ర ఇబ్బందుల మధ్య అక్కడ ప్రజలు జీవనం సాగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వారి కష్టాలు తీరిపోయాయి. కొండవాలు ప్రాంతాల్లో సౌకర్యాలు సమకూరాయి. బండరాళ్లు ఇళ్లపై పడకుండా రక్షణ గోడలు నిర్మించారు. మెట్ల మార్గాలు మెరుగుపరిచారు. నీటి సదుపాయం కూడా సమకూరింది. హిమాచల్‌నగర్, వాయుపుత్రకాలనీ, ఇందిరాకాలనీ, అశోక్ నగర్ కొండ ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సారథ్యంలో చర్యలు తీసుకున్నారు.

–మల్కాపురం/సింధియా

సైకిల్ షెడ్డుకు..గ్లాసు సింక్‌లోకి...

- ఎన్నికల తరువాత ఆ పార్టీల పరిస్థితి
- ఆ పార్టీలకు ఆదరణ లేదు
- వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి
- ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి రమాకుమారి
- పార్టీలో చేరిన జనసేన,టీడీపీ కార్యకర్తలు



పార్టీలో చేరిన వారితో రమాకుమారి

మల్కాపురం : ఎన్నికల అనంతరం సైకిల్ షెడ్డుకు.. గాజుగ్లాసు సింక్‌లోకి వెళ్లడం ఖాయమని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. టీడీపీది వెన్నుపోటు పార్టీ అయితే..సిద్ధాంతం లేనిది జనసేన అని స్పష్టం చేశారు. వీరెంతమందితో కలిసి వచ్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాబలం ముందు నిలబడలేని పరిస్థితి అన్నారు. 59వ వార్డులో ఆమె గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన పార్టీలు మునిగిపోయే పడవల్లాంటివి అని..ఆ పార్టీ నమ్ముకున్నవాళ్లకు భవిష్యత్తు లేదని స్పష్టం చేశారు. శాంతినగర్, న్యూ వాయుపుత్రకాలనీ ప్రాంతాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలో చేరారు. వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో చేరిన వీరికి రమాకుమారి కండువాలు వేసి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టోను జనం నమ్మడం లేదన్నారు. విశ్వసనీయతకు మారుపేరు..ఇచ్చిన హామీలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు అపారమైన నమ్మకం ఉందని, అందుకే ఆయన విడుల చేసిన మేనిఫెస్టోకు అన్ని వర్గాల నుంచి ఆదరణ లభించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సోదరుడు ఆడారి ఆనంద్‌కుమార్‌ను మనమంతా గెలిపించుకోవాలన్నారు. ఆడారి ఆనంద్ గెలుపుతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆమె ఓటర్లకు సూచించారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు పుర్రె సురేష్‌యాదవ్, శాంతిగిరికాలనీ, వాయుపుత్రకాలనీ ప్రాంత వాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి విజయం చేకూర్చాలి

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



ప్రచారంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఆడారి ఆనంద్‌కుమార్, బొత్స ఝాన్సీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి గురువారం వార్డుల్లో విస్తృత ప్రచారం చేశారు. అంబేడ్కర్ నగర్ నుంచి మర్రిపాలెం వుడా లే అవుట్ కాలనీ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అభిమానులు నృత్యాలు, డప్పు వాయిద్యాలతో భారీగా తరలివచ్చి ప్రచారంలో పాల్గొన్నారు. శాంతినగర్, మర్రిపాలెం వుడా లే కాలనీల్లో పర్యటించి ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కాలనీ వాసులను అభ్యర్థించారు. కార్యక్రమంలో విశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లా కృష్ణ, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు జియ్యాని మారుతీ, జి. రామకృష్ణ, శ్రీదేవి వర్మ, జియ్యాని విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు



వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్




విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వరుగీస్

- ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వరుగీస్
- ఘనంగా నేషనల్ సైన్స్‌డే వేడుకలు ప్రారంభం

గోపాలపట్నం: భవిష్యత్తు శాస్త్రవేత్తలు నేటి విద్యార్థులేనని ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్ అన్నారు. గురువారం నేవల్ సైన్స్ అండ్ టెక్నాలాజికల్ లేబొరేటరి(ఎన్ఎస్టీఎల్)లో జాతీయ సాంకేతిక దినోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా విద్యర్థులు రూపొందించిన నమూనాలు కొత్త ఆలోచనలకు పదును పెడుతున్నాయన్నారు. నగర పరిధిలో 150 మోడల్స్ వచ్చాయన్నారు. అందులో 50 నమూనాలు ప్రదర్శనలో ఉంచామని తెలిపారు. విద్యార్థులు తమలో ఉన్న సృజనాత్మకతను, సాంకేతికత భవిష్యత్తు ఆలోచనలను తమ నమూనాల ద్వారా ప్రదర్శించారని కొనియాడారు. ఓపెన్ హౌస్‌లో ప్రదర్శనలన్నీ తిలకించారు. వాటి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్, శాస్త్రవేత్త ×ఎఫ్ ॰ డాక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు చూపిన ఉత్సాహాన్ని చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రదర్శనల ఈ నెల 11 వరకు ఉంటాయని తెలిపారు. ఇందులో అత్యుత్తమ నమూనాలకు శుక్రవారం బహుమతులు అందిస్తామని తెలిపారు. అసోసియేట్ డైరెక్టర్ హెచ్ఎస్ దాస్‌తో పాటు మూడు ఫోరమ్‌ల ప్రతినిధులు సందర్శించారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్టీఎల్ ఉద్యోగులు, పలు పాఠశాలల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పండి



మాట్లాడుతున్న పిల్లా రమాకుమారి

సింధియా : నూతన సంస్కరణలు-పరిపాలన వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశమని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ, జయేంద్రకాలనీలోని వైఎస్సార్‌సీపీ క్యాడర్‌తో గురువారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాధుల సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పిల్లా రమాకుమారి, 3 జిల్లాల వైఎస్సార్‌టీయూసీ ఇన్‌చార్జ్ కలిదిండి బద్రీనాథ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారన్నారు. ప్రజల అభిమానాన్ని చూరగొన్న పశ్చి మ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని గెలిపించాలని అభ్యర్థించారు.

రూ.4 లక్షల విరాళం

సింహాచలం: చందనోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని న్యూకాలనీలోని అక్షయ ఆస్పత్రి యాజమాన్యం రూ.4 లక్షల విరాళం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణకు అందజేశారు. దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

యాదవులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న పిల్లా రమాకుమారి

మల్కాపురం : యాదవుల అండగా ఉంటామిని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి తెలిపారు. నక్కవానిపాలెం పార్టీ కార్యాలయంలో గురువారం యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. స్థానిక నాయకులు ఉరుకూటి శారదయాదవ్, ఉరుకూటి బంగార్రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పిల్లా రమాకుమారి అతిథిగా పాల్గొన్నారు. యాదవులంటే తమకు ఎనలేని అభిమానం ఉందన్నారు. యాదవులను తాము శుభసూచికంగా భావిస్తామన్నారు. యాదవుల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. యాదవ కార్పొరేషన్ ద్వారా వారికి అనేక పదవులతో గౌరవించిందని తెలిపారు. విశాఖ నగర మేయర్, ఎమ్మెల్సీ, వుడా చైర్మన్ వంటి కీలకమైన పదవుల్లో యాదవులు ఉన్నారన్నారు. మనమంతా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

చర్చలు మళ్లీ విఫలం

పెదగంట్యాడ: గంగవరం పోర్టు అధికారులు, కార్మికులతో గురువారం నిర్వహించిన చర్చలు మళ్లీ విఫలమయ్యాయి. తమ డిమాండ్ల సాధన కోసం అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో చర్చలు సాగించాలని అదానీ గంగవరం పోర్టు లిమిటెడ్‌ను హైకోర్టు ఆదేశించడంతో ఈ సమావేశం నిర్వహించారు. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ డైరెక్టర్ జీజే రావు, పోర్టు సీఈవో అమిత్ మాలిక్ కార్మికులను చర్చలకు ఆహ్వానించారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కార్గో సరఫరాతో సహా కార్యకలాపాలను తిరిగి ప్రారంభించానికి ఆర్ అండ్ ఆర్ కార్మికులు నిరాకరించారు. దీంతో సమావేశం ముగిసింది.